పండుటాకులపై పగ

ఒకటో తేదీ వచ్చిందంటే.. అవ్వా తాతలు, దివ్యాంగుల ముఖాల్లో ఎనలేని సంతోషం. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పెన్షన్ వస్తుందని నమ్మకం. అది కూడా ఎలాంటి ఆపసోపాలు, వ్యయప్రయాసలకు తావు లేకుండా ఉదయాన్నే వలంటీర్లు తలుపు కొట్టి పింఛన్లు అందజేస్తారని భరోసా.. అయితే ఏప్రిల్ 1 వచ్చేసింది.. తెల్లవారు జామున వలంటీర్ ఇంటికి రాలేదు.. పెన్షన్ అందలేదు. దీనికి స్వార్థ రాజకీయాలే కారణమని తెలుసుకుని ఆవేదన చెందుతున్నారు. మాపై ఎందుకింత కక్ష అని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- మేం సచివాలయాలకు వెళ్లగలమా?
- వృద్ధులు, దివ్యాంగులపై ఎందుకింత కక్ష?
- మళ్లీ పాతరోజులను తెస్తున్న చంద్రబాబు
- రోజుల తరబడి నిరీక్షణకు చెక్ పెట్టిన జగనన్న
- ఆ సేవలనూ దూరం చేస్తూ రాజకీయాలా?
- పింఛన్ లబ్ధిదారుల ఆవేదన

గాజువాక/పెదగంట్యాడ/అక్కిరెడ్డిపాలెం/అగనంపూడి/కూర్మన్నపాలెం: ప్రతి నెలా ఇంటింటికీ అందుతున్న పింఛన్లను ప్రతిపక్ష పార్టీ అడ్డుకోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎండనకా, వాననకా రోజుల తరబడి పింఛన్ల కోసం ఎదురు చూసే పరిస్థితి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుతుండగానే వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చే పరిస్థితిని కల్పించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి భయపడి చంద్రబాబు ఇలాంటి దుశ్చర్యకు పాల్పడటం దుర్మార్గమంటూ ఆవేదన చెందుతున్నారు. వలంటీర్లను ఆపేయడంతో పింఛన్లను ఆయా సచివాలయాల్లో అందజేస్తారని ప్రభుత్వం చెబుతున్న నేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులతో పాటు పింఛన్ లబ్ధిదారులందరూ ఆందోళన చెందుతున్నారు. సచివాలయాలకు వెళ్లాలంటే వృద్ధులు చాలా అవస్థలు పడాల్సి ఉంటుంది. తీరా వెళ్లిన తరువాత అక్కడ కూర్చోవడానికి కూడా సరైన ఏర్పాటు ఉండే అవకాశం లేదు. గాజువాక నియోజకవర్గంలో వార్డు సచివాలయాలు 106 ఉన్నాయి. మొత్తం 26,904 పింఛన్లను ఆయా సచివాలయాల ద్వారా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తారు. ఇప్పుడు వలంటీర్లను ఆపేయడంతో పింఛన్ల పంపిణీ అయోమయంగా మారింది. ఈ పరిస్థితుల్లో వృద్ధులు, దివ్యాంగులు తమకు డబ్బు ఎలా అందుతుందా అని ఆందోళనకు గురవుతున్నారు.


గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం పడిగాపులు (ఫైల్)

వార్డులు	లబ్ధిదారులు		
64	1777	73	1134
65	1893	74	1936
66	1564	75	1395
67	1265	76	1451
68	1485	79	600
69	1981	85	1701
70	1768	86	1710
71	1676	87	1748
72	698	88	1122
		మొత్తం	26904

మా అమ్మను ఎలా తీసుకువెళ్లాలో?



మా అమ్మ షేక్ హుస్సేన్ బీ (80 +) వృద్ధాప్యంలో కదల్లేని పరిస్థితుల్లో ఉన్నారు.ఐదు సంవత్సరాల నుంచి వలంటీర్లు ఒకటో తేదీన ఉదయాన్నే 6 గంటలకు పింఛన్ తెచ్చి ఇచ్చేవారు. ఇప్పుడు సచివాలయానికి వెళ్లి తీసుకోవాలంటున్నారు. మంచానికే పరిమితమైన మా అమ్మను సచివాలయానికి ఎలా తీసుకువెళ్లాలి? కానీ ఆ డబ్బే మా అమ్మ మందులకు, ఇతర ఖర్చులకు ఆధారం. మా అమ్మలాంటి వారికి ఏదో దారి చూపించాలి.
– షేక్ సైదా బీ (షేక్ హుస్సేన్ బీ కుమార్తె) 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం

పింఛన్ల పంపిణీపై రాజకీయాలా?



ప్రతి నెలా వలంటీర్ వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఈ నెల ఇప్పటివరకు పింఛన్ రాలేదు. రేపో, ఎల్లుండో సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని అంటున్నారు. నాకు కొద్దికాలం క్రితం కాలు విరిగిపోవడంతో నడవలేకపోతున్నాను. నా పని కూడా నేను మరొకరి సాయం లేకుండా చేసుకోలేకపోతున్నాను. ఈ పరిస్థితుల్లో సచివాలయానికి ఎలా వెళ్లగలను? ఇది చాలా అన్యాయం. పింఛన్ల పంపిణీపై చంద్రబాబు ఇంతటి రాజకీయం చేయడం తగదు. వృద్ధులు, దివ్యాంగులను ఈ విధంగా కష్టపెట్టడం మంచిది కాదు. – పి.వెంకటరావు, కాశీపాలెం

కూలిపని మానుకుని వెళ్లాలి



వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీనే తెల్లవారుజామున ఇంటి వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చేవారు. ఈ నెల నుంచి సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలని చెబుతున్నారు. కూలి పనులకు వెళ్తే గానీ పూట గడవని పరిస్థితి నాది.. ఇప్పుడు ఒక రోజు పని మానుకుని సచివాలయానికి వెళ్లాలంటే ఇబ్బందే. అక్కడికి వెళ్లినా ఎంత సేపు వేచి ఉండాలో? గత ప్రభుత్వం మాదిరిగా గంటల కొద్దీ ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఆందోళనగా ఉంది. – కండిపిల్లి నూకమ్మ, వితంతువు, నడుపూరు

మళ్లీ పడిగాపులు పడే పరిస్థితి తెచ్చారు



ప్రతీ నెలా ఒకటో తేదీన తెల్లవారక ముందే పింఛన్ తెచ్చి ఇచ్చే వలంటీర్ల సేవలు నిలుపుదల చేయించారు. ఇప్పుడు పింఛన్ తెచ్చుకునేందుకు సచివాలయానికి వెళ్లాలంటే నేను ఎలా వెళ్లగలను? ఆటోలో వెళ్లాలన్నా ఒక్కడినీ వెళ్లలేను. ఎవరో ఒకరు పనులు మానుకుని తోడు రావాలి. ముఖ్యమంత్రి జగన్ దయ వల్ల వలంటీర్ల ద్వారా ఇంటికే వచ్చే పింఛన్ వచ్చేది. స్వార్థ రాజకీయాలతో మళ్లీ పింఛన్ కోసం పడిగాపులు పడే పరిస్థితి తెచ్చారు. ఇది సరికాదు.
– సర్వసిద్ధి చిన్నప్పన్న, దివ్యాంగుడు, వెదుళ్లనరవ

పెన్షన్ కష్టాలు మళ్లీ మొదలు..



నాకు వృద్ధాప్య పింఛన్ వస్తోంది. టీడీపీ హయాంలో పెన్షన్ కోసం ఆఫీసుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా మంజూరు కాలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే పెన్షన్ ఇచ్చారు. ప్రతి నెలా 1వ తేదీన మా వలంటీర్ తలుపు తట్టి మరీ పెన్షన్ డబ్బులు అందించేది. సమయానికి అందుబాటులో లేకపోతే ఎక్కడున్నావమ్మా అంటూ మళ్లీ ఫోన్ చేసి మరీ పెన్షన్ అందించేది. కుటుంబ సభ్యులే పట్టించుకోని ఈ రోజుల్లో సొంత బిడ్డలా ఆలోచించి సీఎం జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ల ద్వారా పెన్షన్ అందిస్తుంటే బురద జల్లడం అన్యాయం. ఇప్పుడు రాజకీయాలతో పెన్షన్ కష్టాలు మొదలయ్యాయి. – మాడిన సన్యాసమ్మ, వడ్లపూడి

సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
98490 98674
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

తిప్పల చినఅప్పారావు సేవలు మరువలేం


తిప్పల చినఅప్పారావు చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: గాజువాక వర్తక సంఘం అధ్యక్షునిగా తిప్పల చినఅప్పారావు చేసిన సేవలు మరువలేమని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. తిప్పల చినఅప్పారావు నాలుగో వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆటోనగర్ యూనియన్ ప్రధాని కార్యదర్శి గొందేశి పెదరెడ్డి ఆధ్వర్యంలో తిప్పల నితీష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తి రెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, ఐలా అధ్యక్షుడు సత్యనారాయణ, ఎం.కృష్ణారావు, గొందేశి అప్పలరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, హరి, రామకృష్ణ, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోలిపల్లి అమ్మవారి పండగ

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు చిన్నఅక్కిరెడ్డిపాలెం గ్రామ దేవత పోలిపల్లి అమ్మవారి పండగను మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖా మంత్రి, గాజువాక నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య, వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గం అదనపు పరిశీలకుడు తిప్పల దేవన్ రెడ్డి, కార్పొరేటర్ గుడివాడ అనూష, పార్టీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, నగర ప్రధానకార్యదర్శి సంగ్రాన నూకరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త గొంతిన నూకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఒంటి పూట బడులపై అధికారులు దృష్టి సారించాలి

ఎంవీపీ కాలనీ: పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు నేపథ్యంలో ఒంటిపూట బడుల నిర్వహణపై రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం సూచించారు. మంగళవారం ఎంవీపీ కాలనీలో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడారు. విశాఖ జిల్లాతో పాటు రాష్ట్రంలోని 25 జిల్లాల అధికారులు ఈ మేరకు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలు, కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఒంటిపూట బడులు సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు అనుగుణంగా కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. ఇంకా కొన్ని యాజమాన్యాలు రెండు పూటలా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించే పాఠశాలల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మధ్యాహ్నం తరువాత విద్యార్థులతో తిరిగే స్కూల్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రవాణా శాఖ సైతం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆయన తెలిపారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం 14 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కె.శాంతారాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బ్యాగులో రూ.71,050 విలువ గల 14 కేజీల 3.10 గ్రాముల గంజాయిని గుర్తించారు. బ్యాగును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు శాంతారాం తెలిపారు.

మరుగునపడ్డ ఎన్నో సమస్యలను పరిష్కరించాం

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అమర్‌నాథ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్

గాజువాక: గాజువాకలో ఎన్నో ఏళ్లుగా మరుగున పడి ఉన్న అనేక సమస్యలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కరించిందని ఆ పార్టీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ చెప్పారు. గాజువాకలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పూర్తిగా వ్యతిరేకమన్నారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1146 రోజుల నుంచి చేస్తున్న పోరాటానికి ప్రభుత్వం పూర్తిగా సహకరించిందన్నారు. స్టీల్ కార్మికులు, పోరాట కమిటీ నాయకులు వివిధ రూపాలలో చేసిన ఆందోళనలు, రాస్తారోకోలు, నిరసనలపై ఒక్క కేసు కూడా లేకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సహకరించిందన్నారు. టీడీపీ కూటమి మాత్రం ప్రజలను, కార్మికులను మోసం చేస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కారణమైన బీజేపీతో టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నాయని, ఈ కూటమికి తగిన విధంగా బుద్ధి చెప్పాలని కోరారు. గాజువాక ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీలక్ష్మిని గెలిపించాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, నాయకులు తిప్పల దేవన్ రెడ్డి, ఉరుకూటి అప్పారావు, గుడివాడ లతీష్, మొల్లి చిన్న తదితరులు పాల్గొన్నారు.

'మీ గెలుపును జగన్‌కు బహుమతిగా ఇస్తాం'

ఎంపీ అభ్యర్థి ఝాన్సీతో ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురుమూర్తిరెడ్డి


నాగిరెడ్డి, గురుమూర్తిరెడ్డితో ఎంపీ అభ్యర్థి ఝాన్సీలక్ష్మి

గాజువాక: విశాఖ ఎంపీగా మీ గెలుపును ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి హామీ ఇచ్చారు. వికాస్‌నగర్‌లోని గురుమూర్తిరెడ్డి నివాసంలో వారిని ఝాన్సీలక్ష్మి మంగళవారం కలిశారు. ఎంపీ అభ్యర్థిగా తన గెలుపునకు వారి సహకారం కావాలని కోరారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండాను నియోజకవర్గంలో ఎగరవేసి జగన్ మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇస్తామన్నారు. ఆమె గెలుపులో తమ పూర్తి సహాయ సహకారాలుంటాయని భరోసానిచ్చారు. ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు.

ఘనంగా వేణుగోపాల స్వామి ఆలయ వార్షికోత్సవం


స్వామి సన్నిధిలో ఎమ్మెల్యే నాగిరెడ్డి తదితరులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి ఆర్‌హెచ్ కాలనీలోని యాదవవీధిలో కొలువుదీరిన వేణుగోపాల స్వామి ఆలయ 17వ వార్షికోత్సవాన్ని మంగళవారం కనులపండువగా నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచి ఆలయానికి చేరుకుని, విశేష పూజలు చేశారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనను ప్రారంభించారు. కార్యక్రమంలో 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి, మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ప్రగడ వేణుబాబు, కోమటి రమాదేవి, గొలగాని అప్పలకొండ, వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ సభ్యులు ఈసరపు అప్పలరాజు, బొట్ట రవి తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులపై చిన్నచూపు సరికాదు'


1146వ రోజు ఉక్కు దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో కార్మికులు శ్రమ ఎనలేనిదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి కార్మికులను కేంద్ర ప్రభుత్వం చిన్నచూపు చూడడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1146వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సింటర్‌ప్లాంట్‌కు చెందిన పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ప్లాంట్‌ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ కార్మికవర్గం ఎంతగానో శ్రమించారన్నారు. లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్నం పెడుతున్న స్టీల్‌ప్లాంట్ లాంటి పరిశ్రమను అమ్మాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలకు భంగం కలిగించడమే కాక ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ ప్లాంట్‌ను నష్టాల ఊబిలోకి నెట్టేందుకు యాజమాన్యం ప్రయత్నం చేయడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఆపాలని కోరారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, సంస్థలోని కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ మారువారం పండగ

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు డెయిరీ ఫారం జంక్షన్‌లో కొలువుదీరిన పైడిమాంబ అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. గత నెల 18 నుంచి 26 వరకు అమ్మవారి నవరాత్రి జాతర మహోత్సవాలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మారువారం పండగ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

సంక్షేమం, అభివృద్ధే మా అజెండా

- గెలిపిస్తే మరిన్ని వసతులు కల్పిస్తాం
- వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్
- 69, 71, 72 వార్డుల్లో విస్తృత ప్రచారం


మహిళకు కరపత్రం అందజేస్తున్న అమర్‌నాథ్


71వ వార్డులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి అమర్‌నాథ్ తదితరులు

గాజువాక: సంక్షేమం, అభివృద్ధే తమ పార్టీ అజెండా అని రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ గాజువాక ఎమ్మెల్యే అభ్యర్థి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. తనను గెలిపిస్తే మెరుగైన వసతులు కల్పిస్తామన్నారు. 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు ఆధ్వర్యంలో శ్రీనగర్, సుందరయ్య కాలనీ, దుర్గానగర్, అరుణోదయ కాలనీ, మన్నా ట్యాంక్ ఏరియా, దిబ్బపాలెం పునరావాస కాలనీ, గుర్నాథరావు కాలనీ, ఉప్పర కాలనీ, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఎమ్మెల్యే నాగిరెడ్డి హయాంలో గాజువాకను రూ.500 కోట్లతో అభివృద్ధి చేశారన్నారు. తాను కూడా అభివృద్ధి విషయంలో వెనుకంజ వేయనని అన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మహిళల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రవేశపెట్టారని, అవన్నీ విజయవంతంగా కొనసాగాయని అన్నారు. రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి బాటలో నడవాలంటే జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. అందుకు ప్రజలు పూర్తిగా సహకరించాలని కోరారు. చంద్రబాబు ప్రభుత్వం వస్తే ఇప్పుడున్న పథకాలు అమలు చేయరని, ప్రభుత్వ ఖజానాను ఆయన సొంత మనుషుల చేతిలో పెడతారని అన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు.

అడుగడుగునా నీరాజనాలు

అమర్‌నాథ్ ప్రచారానికి వార్డులో అనూహ్య స్పందన లభించింది. ఈ ప్రచారంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. దారి పొడవునా నీరాజనాలు పలికారు. కొండలపై ఉన్న నివాసాలకు కూడా అమర్‌నాథ్ చేరుకుని కరపత్రాలను అందజేస్తూ తనను గెలిపించాలని కోరారు. సుమారు రెండు గంటల పాటు మహిళలు అమర్‌నాథ్ వెంట నడిచారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజా, నాయకులు తిప్పల దేవన్‌రెడ్డి, ఉరుకూటి అప్పారావు, రెడ్డి జగన్నాథం, మొల్లి చిన్న, తమ్మిన నాయుడు, ప్రమీలా నర్సింహమూర్తి, రమేష్, సిరసపల్లి శ్రీనివాస్, అప్పలాచారి, ఎ.వి.రమణ, వర్మరాజు, గెంజి సత్యనారాయణ, సత్తిరాజు, పప్పల రాజు, సిరసపల్లి గిరిబాబు, అద్దేపల్లి పైడిరాజు, శేషు, గోవింద, బద్దేటి గోవింద్, ప్రసాద్, బొండా అప్పారావు, అప్పలరాజు, కటికల కల్పన, వెంకట లక్ష్మి, విమలా థామస్, సంతోషి, ఉమ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.


71వ వార్డులో ప్రచారంలో పాల్గొన్న మహిళలు


అమర్‌నాథ్‌కు హారతి పడుతున్న మహిళలు

69వ వార్డులో విశేష ఆదరణ

అక్కిరెడ్డిపాలెం: 69వ వార్డులో అమర్‌నాథ్ ప్రచారానికి అశేష ఆదరణ లభించింది. రెడ్డితుంగ్లాంలో అమర్‌నాథ్ తదితరులకు మహిళలు హారతులు పట్టి స్వాగతించారు. గ్రామంలోని విజయరాఘవస్వామి ఆలయంలో స్వామి వారిని దర్శించుకున్న అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ఆయన గ్రామంలో ప్రచారం నిర్వహించారు. మహిళలకు కరపత్రాలు అందజేసి సంక్షేమ పాలన అందించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎంపీగా బొత్స ఝాన్సీని, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఎస్సీ కాలనీలో రాజ్యాంగనిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. 68వ వార్డు అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపడి వెంకట్రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉరుకూటి అప్పారావు, 68వ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, మొల్లి చిన్న, ఈగల పాటి యువశ్రీ, కాకి అప్పల రెడ్డి, సాలాపు వెంకటరావు, అంగ బాబూరావు, వాకాడ దుర్గా రెడ్డి, ఆకుల ఉపమాక, కొల్లి కుంచారావు, వీర్రాజు, బోగాది అప్పారావు, కొల్లి వినోద్ రెడ్డి, ఈతలపాక మంగరాజు తదితరులు పాల్గొన్నారు.


తుంగ్లాం ఎస్సీ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తూ..


ప్రచారంలో పాల్గొన్న అమర్‌నాథ్, ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చింతలపూడి, గురుమూర్తి రెడ్డి

ఉక్కు పరిరక్షణ పోరాటానికి మూడేళ్లు

సీతంపేట: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని చూస్తున్న ప్రధాని మోదీ, బీజేపీకి సహకరిస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు బుద్ధి చెప్పాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జేఏసీ నాయకులు కార్మిక వర్గానికి, విశాఖ ప్రజలకు పిలుపునిచ్చారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరం ఏప్రిల్ 2 నాటికి మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా పోరాట కమిటీ భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి. కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ చైర్మన్ మరడాన జగ్గునాయుడు, జేఏసీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, స్టీల్ గుర్తింపు యూనియన్ నాయకులు ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టినా మోదీ ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఏప్రిల్ 2న జీవీఎంసీ వద్ద దీక్షా శిబిరం ప్రారంభించామన్నారు. మూడేళ్లుగా శిబిరాన్ని విజయవంతంగా నడిపిస్తున్న కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా, మహిళా సంఘాల నాయకులను అభినందించారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు నిలబడే పార్టీలను రానున్న ఎన్నికల్లో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగభూషణం, మన్మథరావు,రమణ, వామన మూర్తి, మణి తదితరులు పాల్గొన్నారు.

బైకు ఢీకొని వ్యక్తి మృతి

పరవాడ: లంకెలపాలెం-సబ్బవరం రహదారిలో మంగళవారం ఉదయం మంత్రిపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వద్ద ఓ వ్యక్తి రోడ్డు దాటుతుండగా అటుగా వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందాడు. ఈ ఘటనలో వెస్ట్ బెంగాల్‌కు చెందిన సహదీప్(52) అనే వ్యక్తి మంగళవారం ఉదయం 5.30 గంటల సమయంలో రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో ఆయనను వెనక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనచోదకుడు బలంగా ఢీకొట్టాడు. సహదీప్ తలకు బలమైన గాయమై తీవ్ర రక్త స్రావం కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడు స్మైలెక్స్ పరిశ్రమలో హెల్పర్‌గా పని చేస్తున్నాడు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు.